# జిల్లాలో సిటీ పోలీసు యాక్ట్ అమలు

## సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 25 నుంచి అక్టోబర్ 10 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ డా॥బి.అనురాధ మంగళవారం తెలిపారు.కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. బంద్ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు,కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయన్నారు. నిబంధనలను ఉల్లంఘించి డిజె వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


# సింగూరు వద్ద విద్యార్థుల మధ్య ఘర్షణ

## -ధ్వంసమైన 3 కార్లు.. పలువురికి గాయాలు

**పుల్‌కల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**

హైదరాబాద్ పట్టణం నుంచి సింగూరు ప్రాజెక్టును తిలకించేందుకు వచ్చిన యువకులు గ్రామానికి చెందిన యువకుల మధ్య మంగళవారం సాయంత్రం ఘర్షణ చోటుచేసుకుంది. కారుల్లో ప్రాజెక్టును వీక్షించేందుకు వచ్చిన యువకులు గ్రామానికి చెందిన యువకుల మధ్య మాటా మాట పెరిగి గొడవకు దారి తీసింది. యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. దాడి జరిగిన సంఘటనలో మూడు కార్లు ధ్వంసం అయ్యాయి.

విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుసుకున్న తెలంగాణ ప్రత్యేక పోలీసులు సింగూరు వద్దకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.




ఈవిఎంలు భద్రపరచిన గదులను సీజ్ చేసిన కలెక్టర్ హైమావతి

# ఈవిఎంలకు భద్రత కల్పించాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన గల ఈవిఎం గోడౌన్‌లో పోలీస్ సిబ్బందితో భద్రపరచిన గదులను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు. అలాగే ఈవిఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పని తీరును పరిశీలించారు. మిషన్‌లకు గట్టి రక్షణ కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి ఈ ఈవిఎం గోడౌన్‌ల పరిశీలన ఉంటుందన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో భద్రపరచిన రూంలను పరిశీలించి మళ్లీ సీజ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ అహ్మద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలు, ఉమేష్‌తో పాటు ఎన్నికల విభాగం అధికారులు తదితరులు ఉన్నారు.

# సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం

## -ఇన్‌ఫ్లో..ఔట్‌ఫ్లో 58892 క్యూసెక్కులు



సింగూరు ప్రాజెక్టు

**పుల్‌కల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింతగా పెరిగింది. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలైన కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో...ఔట్ ఫ్లో 58,892 క్యూసెక్కులు నమోదైంది. 7 క్రస్ట్ గేట్ల ద్వారా 56,597 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు ద్వార 1,635 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరవుతోంది. మంగళవారం రాత్రి వరకు ప్రాజెక్టులో 520.515 మీటర్లకు 16.607 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు ప్రాజెక్టు రికార్డులు ధృవీకరిస్తున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ వద్ద కూడా 4 క్రస్ట్ గేట్లను 5 మీటర్లు ఎత్త ఒక స్క్వర్ గేట్ మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు. మరో వారం రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్‌రెడ్డిలు వివరించారు.

# అలుగులు పారుతున్న చెరువులు



అలుగు పారుతున్న దేవతలు చెరువు

**వెల్దుర్తి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** కొద్ది రోజుల నుండి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో వాగులు వంకలు చెరువులు నీరు చేరి అలుగులు పారుతున్నాయి. మండలంలోని చెక్ డ్యామ్ లతోపాటు మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి వద వెలసిన హల్దీ ప్రాజెక్టు సైతం నిండుకుండలా భారీగా వచ్చే వరద నీటితో నిండి మతర్లు పారుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన వెల్దుర్తి లోని దేవతలు చెరువు నిండి నాలుగు పారుతున్నడంతో చెరువు కింది ఆయకట్టుదారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు వెళ్లొద్దు

## విద్యుత్ శాఖ ఎడిఇ రమణారెడ్డి

**నర్సాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :**

రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని విద్యుత్ శాఖ ఏడీఈ రమణారెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏదైనా సమస్యలు వస్తే విద్యుత్ సిబ్బంది, లైన్‌మెన్, ఏఈకి సమాచారం అందించి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు విద్యుత్ సమస్య వచ్చినప్పుడు విద్యుత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అంతేగాక విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. పట్టణంతోపాటు గ్రామాల్లో సైతం లో వోల్టేజ్ లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి తాను కృషి చేస్తానన్నారు. అయితే ఏ గ్రామంలోనైనా పట్టణంలోనైనా విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. దీంతో వెంటనే అట్టి విద్యుత్ సమస్య పరిష్కారం చేస్తామని విద్యుత్ శాఖ ఏడి ఈ రమణారెడ్డి తెలిపారు.

## నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదానం

**మనూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలోగల శ్రీనల్లపోచమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేక పూజలు నిర్వ హించి గాయత్రిదేవిగా అలంకరించుకుని కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్య, అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# గూడు లేని ప్రతి పేదకు ఇందిరమ్మ ఇళ్లు

## కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం తుగ్లక్ పాలన సాగించిదే తప్ప పేదలకు ఒరగబెట్టిందేమి లేదని రాష్ట్ర కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రం లోని 37వ వార్డు అంబేద్కర్‌నగర్, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో మంగళవారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రూ.60వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లు అప్పుల పాలుచేసిందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా డబుల్‌బెడ్ రూం పేరిట నాటకాలు ఆడిందే తప్ప ఒక్క పేదోడికి ఇల్లు కట్టించిన పాపానపోలేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గూడు లేని ప్రతి పేదకు గూడు కట్టించి ఇవ్వడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చూస్తుంటే సంతోషం కలుగుతుందన్నారు. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్న రీడిజైన్ పేరిట ప్రాజెక్టు స్థలం మార్చి దోచుకున్నారని ఆరోపించారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి కెటిఆర్ ప్రపంచంలోనే కాళేశ్వరం పెద్ద ప్రాజెక్టు అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన సాగిస్తుందన్నారు. గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు,



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరుగుతుందన్నారు.ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సిద్దిపేటలో ఎంతో నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్నారని అభినందించారు. ఇళ్లు నిర్మించేకునే లబ్దిదారులకు వెంటనే డబ్బులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కాగా ఎన్సాన్‌పల్లిలో ఎన్సాన్‌పల్లిలో లబ్దిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు), కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మీఆనంద్, నాయకులు సొప్పదండి చంద్రశేఖర్, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, గంప మహేందర్‌రావు, ముద్దం లక్ష్మీ, ఎర్ర మహేందర్, గయాజుద్దీన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామికి కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు.

# ఆహారంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

## * మదర్సాలో అస్వస్థతకు గురైన పిల్లలు సేఫ్ * మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :**

చేగుంట మండలానికి చెందిన మదర్సాలో అస్వస్థతకు గురైన పిల్లల ఆరోగ్యం నిలకడగా ఉందనీ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అత్యవసర వైద్య సేవలు అందిస్తూ పటిష్ట చర్యలు తీసుకున్న వైద్య యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. మంగళవారం కలెక్టర్ రామాయంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సందర్శించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్యపరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు, రెస్టారెంట్లు హోటళ్ల ప్రజలకు అందించే ఆహారం విషయంలో నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రమైన వంట ఉంటే మీరు అనారోగ్యాలకు దూరంగా ఉండటానికి దోహద పడుతుందని, త్వరలో జిల్లాలోని అన్ని హోటల్స్ రెస్టారెంట్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన వైద్య చికిత్సలు అందడంతో విద్యార్థులందరూ సేఫ్ జోన్ లోకి వెళ్లడం జరిగిందని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో పరిశుభ్రమైన వంటకు ప్రాధాన్యతనిస్తూ ఆహారం కలుషితం కాకుండా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ యాజమాన్యాలను ఆదేశించారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ మదర్సా ముస్లిం ప్రైవేట్ వసతి గృహంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించి పిల్లలు 25 మంది వసతి పొందుతున్నారని, 23వ తేదీ సోమవారం రాత్రి వారు తీసుకున్న భోజనంలో



కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను సందర్శించి డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నాణ్యత లోపించి 10 మంది వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురి కావడం జరిగిందని, పదిమంది తీవ్ర అస్వస్థతను దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించడం జరిగిందన్నారు. తక్షణ సహాయ చర్యలపై వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు వైద్య సేవలు అందించాలని రామాయంపేట వైద్యాధికారులకు, అధికారులకు సూచించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. కలుషిత ఆహారం సంఘటనపై పూర్వోపరాలు తెలుసుకోవడానికి మెడికల్ బృందాన్ని కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలు, హోటల్స్ రెస్టారెంట్లను ఆహారం పరిశుభ్రతలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆరోగ్యంగా ఉండటానికి వంటగదిని, ఆహారాన్ని శుభ్రంగా ఉంచుకోవడం.ఆహారాన్ని వండే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పాత్రలు, కట్టింగ్ బోర్డులను శుభ్రంగా ఉంచడం, తాజా పదార్థాలను వాడటం, వండిన ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం వంటివి పరిశుభ్రమైన వంటలో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజని, డాక్టర్ శివ దయాల్, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి అవతారంలో వనదుర్గమ్మ

**పాపన్నపేట, సెప్టెంబరు 23. ప్రభాతవార్త :** ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వనదుర్గామాతను గాయత్రీ దేవి (బ్రహ్మచారిణి) రూపంలో, గులాబీ రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. రాజగోపురంలో ప్రతిష్టించిన ఉత్సవ విగ్రహం వద్ద పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంజీరా నది ప్రవాహంతో ఆలయం జలదిగ్బంధంలో ఉంది. మూలవిరాట్ అమ్మవారిని దర్శించుకునే భాగ్యం లేకుండా పోయిందేనని భక్తులు కాస్త చింతనకు లోనవుతున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న గోకుల్ షెడ్ లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేకువ జాము నుంచే ఆలయ అర్చకులు శంకర్ శర్మ. మురళీ శర్మ. పార్థివ శర్మ లు. ప్రత్యేక పూజలు కొనసాగిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు.. వ్యాపారవేతలు తిమ్మయ్య గారి వేణుగుప్త. శ్రీనివాస్ గుప్తా. ఎర్రం రవీందర్ గుప్తా దంపతులు. నాయకులు బాలా గౌడ్. రాగి అశోక్.. యేగోబా. అంజిరెడ్డి. నాగిరెడ్డి. తోపాటు ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేడు అన్నపూర్ణాదేవిగా వన దుర్గమ్మ దర్శనం...**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన బుధవారం వనదుర్గామాత అన్నపూర్ణా(చంద్ర ఘంటా) దేవి రూపం, నీలం రంగు వస్త్రంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

# హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై ఆకస్మిక తనిఖీలు

## కుళ్లిపోయిన ఆహార పదార్ధాలు, పరిశుభ్రత పాటించని హోటళ్లకు జరిమానా

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు బేకరీలను మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కొన్ని హోటళ్లలోని ఫ్రిజ్‌లలో కుళ్లిపోయిన ఆహార పదార్ధాలు దొరకగా మరికొన్ని హోటల్స్, బేకరీలలో నాణ్యత పాటించడం లేదని గమనించారు. అంతేకాకుండా ఆహార పదార్థాల తయారీ సమయంలో పాటించాల్సిన నిబంధనలను హోటల్ యాజమాన్యాలు పాటించడం లేదని, తినుబండరాలు, బిర్యాని లాంటివి తయారు చేస్తున్నప్పుడు వారు పాటించాల్సిన నిబంధనలను గురించి వివరించారు. కుళ్లిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన దావత్ రెస్టారెంట్‌కు రూ. 20 వేలు, బావర్చికి రూ.10 వేలు, రాజుగారి బిర్యానీ రెస్టారెంట్‌కు రూ 10 వేలతో పాటు నాణ్యత పాటించని మైసూర్ బేకరికి రూ 1 వెయ్యి, వీనస్ మెస్‌కు రూ 1 వేయి, మస్తీ కిచెన్‌కు రూ 5వేలు, స్వాగత్ రెస్టారెంట్‌కు రూ 2వేలు, రిషి బిర్యాని సెంటర్‌కు రూ 2వేల చొప్పున జరిమానా విధించి హోటల్స్, రెస్టారెంట్‌ల నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటల్స్,




కుళ్లిపోయిన చికెన్ బిర్యానీని తీసుకెళుతున్న అధికారులు

రెస్టారెంట్‌లలో నాణ్యత పాటించాలని, ఇంకోసారి నాణ్యత పాటించకుంటే హోటల్‌ల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, బిల్ కలెక్టర్ సతీష్‌తో పాటు సిబ్బంది సారయ్య, ప్రభాకర్, శేఖర్, నవాకర్, సాగర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సాగు వివరాల నమోదు తప్పనిసరి

## -జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారని, డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వ్యవసాయ విస్తరణ అధికారులు పంట సర్వేను చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి స్వరూపారాణి తెలిపారు. మంగళవారం గజ్వేల్ పరిధిలోని రైతు రాజు సాగుచేస్తున్న మొక్కజొన్న, పత్తి పంటలను ఆన్‌లైన్ నమోదును పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా తప్పనిసరిగా సంబంధిత సర్వే నెంబర్‌లోకి వెళ్ళి నమోదు చేసే విధంగా ఆప్‌ను రూపకల్పన చేయడం జరిగిందని తెలిపారు. ఈ సీజన్ లో పండించిన ప్రతి పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయ టానికి రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ముందస్తు బుకింగ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు మరియు ఎన్‌డిఎస్ రైతులు కూడా తప్పనిసరిగా పంట బుకింగ్ చేసుకోవాలని, వ్యవసాయ విస్తరణాధికారులు వేర్వేరు రిజిస్టర్లలో నమోదు చేస్తారని అన్నారు. అభ్యంతరాల పరిష్కారానికి క్రాప్ బుక్ చేసిన పంట వివరాలు గ్రామపంచాయతీ కార్యా లయంలో ప్రదర్శించబడతాయని తెలిపారు. పంట బుకింగ్ చేయని రైతులకు కొనుగోలు ప్రయోజనాలు అందుబాటులో ఉండవన్నారు. మొక్కజొన్న, పప్పుధాన్యాలు, సోయాబీన్ లాంటి కోత పూర్తయిన పంటలు రైతులు నమోదు చేసుకోవాలని, ఈ సీజన్‌లో వంద శాతం ఆన్‌లైన్ పంట బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రైతులందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని తమ పంటను ఎంఎస్‌పి వద్ద విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడిఏ బాబునాయక్, ఏఓ నాగరాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



దొంగతనానికి పాల్పడిన దుండగుల దృశ్యం

# గుమ్మడిదలలో పట్టపగలే చోరీలు

## కాంగ్రెస్ నాయకుడి కార్యాలయంలో దొంగతనానికి ప్రయత్నం

## మహిళ మెడలో నుంచి ఐదు తులాల బంగారు గొలుసు అపహరణ

**గుమ్మడిదల సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీలో 24 గంటల వ్యవధిలో రెండు దొంగతనాలు చోటు చేసుకున్నాయి. ఒకటి ప్రముఖ పార్టీ నాయకుడి కార్యాలయంలోకాగా రెండవది పట్టపగలు ముసలామె మెడలో నుంచి హారాన్ని దొంగతనం చేశారు. మండల కేంద్రంలో దొంగతనాలు జరగటం సర్వసాధారణమైపోయింది. ఒంటరిగా కనిపించిన జీడి రాగమ్మను మంచినీళ్లు అడిగే నెపంతో ఆమె మెడలోనుండి 5 తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోవడం జరిగింది. కొన్ని నెలల క్రితం చిమ్ముల జయపాల్ రెడ్డి రజిత దంపతుల ఇంట్లో చోటు చేసుకున్న 30 తులాల బంగారం దొంగతనం ఈ కేసులో పది తులాల బంగారం రికవరీ తప్ప మిగతా ఏ దొంగతనం కేసులోనూ దొంగతనం జరిగిన సొత్తు రికవరీ అయినట్టు పోలీసుల నుండి ఆధా రాలు లభించలేదు. అడపాదడపా జరుగుతున్న చోరీల వల్ల ప్రజలలో భయం పట్టుకుంది. పోలీసులు సరైన భద్రతా చర్యలు తీసుకుని దొంగత నాలను అరికట్టాలని రాత్రి వేళలో పోలీసులు పెట్రోలింగ్ మరి వేగం పెంచాలని మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో తాపిమేస్త్రి మృతి

**వెల్దుర్తి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన వెల్దుర్తిలో సోమవారం రాత్రి జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన తాపీమేస్త్రీ నారాయణశర్మ(37), ప్రభు కుమార్‌శర్మ, వినోద్‌శర్మ, సంతోష్‌శర్మ, దల్లుశర్మ కలిసి కొన్ని సంవత్సరాలుగా వెల్దుర్తి లో పనిచేసుకుంటూ ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్‌లో నివసిస్తున్నారు.ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వీరు పనులు ముగించుకొని ఇంటికి రాగా ఇంట్లోకి కరెంటు సరఫరా కాకపోవడంతో విద్యుత్ సరి చేయ దానికి నారాయణశర్మ ఇంటి పైకప్పు ఎక్కి కరెంటువైర్ కనెక్షన్ ఇస్తుండ గా ప్రమాదవశాత్తున షాక్ తగలగా వెనక నున్న పిల్లర్‌పై పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆటోలో చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు పరిక్షించి చనిపోయాడని చెప్పారు. విషయం పోలీసులకు తెలపడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయన్నారు.

## పిడుగు పడి మేకలు, పొట్టేళ్లు మృతి

**నంగునూర్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త :** పిడుగు పాటుకు గురై 5 మేకలు, 2 పొట్టేళ్లు మృత్యువాత పడిన సంఘటన సోమవారం సాయంత్రం మండల పరిధిలోని సంతోష్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్‌నగర్ గ్రామానికి చెందిన ఇరిగదిండ్ల సాయిలు మేకల, గొర్రెల మందను రోజు మాదిరిగానే మేత కోసం గ్రామ సమీపంలోని అడివికి తీసుకెళ్లాడు. దీంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో 5 మేకలు, 2 గొర్రె పొట్టెల్లు ఒక చెట్టు కిందకు వెళ్లాయి. ఈ క్రమంలో ఆ చెట్టుపై పిడుగుపడడంతో 5 మేకలు, 2 గొర్రె పొట్టెలు అక్కడిక్కడే మృత్యువాత పడ్డాయని మేకల కాపరి సాయిలు తెలిపారు. పిడుగు పడిన సమయంలో మిగతా మేకలతోపాటు సాయిలు మరో చెట్టుకింద ఉన్నట్లు తెలిపారు. మేకలను కాస్తూ జీవనం కొనసాగిస్తున్న తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు



నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## హామీల అమలులో ముఖ్యమంత్రి విఫలం

### బిఆర్ఎస్ నేత వజీరుద్దీన్ అబ్దుల్ మొయిజ్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు వజీరుద్దీన్ అబ్దుల్‌మొయిజ్ మండిపడ్డారు. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా మూడు ఖబ్రస్థాన్‌లు, ఒక దర్గాను కూల్చివేయడాన్ని నిరసిస్తూ సిద్దిపేటలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అదే దర్గాలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి అధికారంలోకి వచ్చాక ప్రార్థన చేసినా దర్గానే కూల్చివేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు సమీపిస్తున్నా మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతుందని వాపోయారు. ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్, నాయకులు జీవిద్, ఆదాబ్ మొయిద్, ఆహ్మద్, అయాన్‌బాబా, షౌకద్, చాంద్, షాహిద్, ఫరీద్, మొయిన్, అయూబ్, అతీక్, గోరిమియా, సోహైల్, వాహెద్, జలీల్, అప్సర్, ఆరీఫ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను జిఎస్‌టి నుంచి తొలగించాలి

### బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను జీఎస్టి నుండి తొలగించాలని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జీ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని దుఖాణాలు, సూపర్ మార్కెట్‌లు, మార్ట్‌లను జీఎస్టి అమలులోకి వచ్చిన సందర్బంగా పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జీఎస్టి అమలులోకివచ్చి పేదలకు నిత్యావసర సరుకులపై భారం తగ్గిందని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పి 48 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు ధరలు ఇంచు మించు అలాగే ఉన్నాయన్నారు. సిమెంట్, ఐరన్, మందుల దుఖానాలలో కూడా పెద్దగా ధరలు తగ్గినట్లు అనిపించడం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రాల నుండి కేంద్రం జిఎస్టి పేరుతో వసూళు చేసి లక్షల కోట్లను తిరిగి రాష్ట్రాల అభివృద్ధికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎనగందుల శంకర్, వేల్పుల రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

## పనుల్లో నాణ్యత పాటించకుంటే చూస్తూ ఊరుకోం

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి


ఎల్లమ్మ చెరువు పనులు పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో నాణ్యత పాటించకుంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఎల్లమ్మ చెరువుకట్ట అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసి 9 నెలలు గడుస్తున్నా పూర్తిచేయకపోగా బతుకమ్మ పండగ వరకు పనులు పూర్తి చేయాలని అంటున్నారని అయితే ఈ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. చెరువును సందర్శించిన వారిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## ప్రజ్ఞాపూర్ ఊర చెరువు సమస్యపై పోరాటానికి సిద్ధం కావాలి : సల్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న బిజెపి దళిత నాయకుడు సల్ల శ్రీనివాస్

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువల సమస్య పరిష్కారం కోసం అన్ని పార్టీలు ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని బిజెపి దళిత నాయకుడు సల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన దళితుల భూములు తీసుకొని ప్లాట్లు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన మాట వాస్తవం కాదా? ఊర చెరువు కాలువలను మూసివేసి కబ్జా చేసి మాట వాస్తవం కాదా? ఎన్నికలు వస్తే పార్టీలు మారి కార్యకర్తలను మోసం చేసిన మాట వాస్తవం కాదా? ఓడగొట్టాలని హరీష్‌రావు ఫోన్‌చేసి కోటమైసమ్మ సాక్షిగా ప్రమాణం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇలా ఎన్నిసార్లు గజ్వేల్ ప్రజలను మోసం చేస్తారో బిఆర్ఎస్ నేతలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. చెరువు నీళ్లు మత్తడి పొంగి కాలనీలకు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజల సమస్యలు తీర్చాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కొలుపుల నరేందర్, వడ్డేపల్లి ప్రసాద్, తలారి రాజు, మంగళపల్లి సత్యనారాయణ, శ్రీరామకృష్ణ, బద్రి, పాండే, నర్సి రవి, బాబు, గోపాల్ పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు బ్యూటీషియన్‌పై శిక్షణ

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** గజ్వేల్‌లోని ముట్రాజ్‌పల్లి మోడల్ స్కూల్ విద్యార్థినిలకు బ్యూటీ అండ్ వెల్‌నెస్‌పై ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వన్నెసా తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు గజ్వేల్‌లోని పలు బ్యూటీపార్లర్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పదిరోజులపాటు ఉంటుందని అన్నారు. పిల్లలు పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ శిక్షణ పొందడం ఎంతో అవసరమని కో-ఆర్డినేటర్ కిషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ లింగాల ప్రశాంతి, ఎంప్లాయర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి


మాట్లాడుతున్న అనురాధరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అండర్ ఇన్విస్టిగేషన్‌లో ఉన్న కేసుల గురించి హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం, సిఐ శ్రీనివాస్‌తో పాటు ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందిన వెంటనే సమగ్ర విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. కేసుల పరిశోదనలో నిర్లక్ష్యంవద్దని, లాంగ్ పెండింగ్ కేసులను స్టేషన్‌లో డిస్పోజల్ చేయాలన్నారు. పోలీసులపట్ల సామాన్యులకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని, వచ్చే ప్రతీ వారితో మర్యాదగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సందర్బంగా ఎన్ఫోర్స్‌మెంట్ డ్యూటీలు నిర్వహించాలని, చాలా రోజుల నుండి పెండింగ్‌లో ఉన్న కేసులను అన్ని కోణాలలో పరిశోధన చేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయంలో బ్లూకోర్ట్స్, పెట్రోకార్ అధికారులు నిరంతరం విధులు నిర్వహించాలని సూచించారు. డయల్ 100కు వెంటనే స్పందించాలన్నారు. నాన్ బెయిల్ కేసుల విషయంలో సాధ్యమైనంత వరకు ఎగ్జిక్యూట్ చేయాలని వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం విజిబుల్ పోలీస్ విధులు నిర్వహించాలని, ఎంవో, అపెండెక్స్, సస్పెక్టులు, కెడిలు, డిసిలతోపాటు రౌడీలపై కదలికలను గమనించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ కుశాల్కర్, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, హుస్నాబాద్ డివిజన్ ఎస్ఐలు పాకాల లక్ష్మారెడ్డి, పుల్ల అభిలాష్, ప్రశాంత్‌రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో 'స్వచ్ఛ ఉత్సవ్'

**నర్సాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** స్వచ్ఛ ఉత్సవ్‌లో భాగంగా 2025 స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి డిఆర్‌సి సెంటర్‌కు తరలించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు వాటి నిషేధం, తడి పొడి చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్ వంటి తదితర విషయాలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారి ఉదయ్ కుమార్ సిబ్బంది మురళి ఎల్లం జనార్ధన్, విష్ణు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, బేసిల్ ఫౌండేషన్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## గాయత్రీదేవిగా అమ్మవారు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొర్విపల్లిలోని ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు రెండవరోజు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్బంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## జెఎన్‌టియులో బతుకమ్మ సంబురాలు

**చౌటకూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** సుల్తాన్‌పూర్‌లోని జెఎన్టీయుహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోటచేర్చి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ వేడుకలను పసందుగా జరుపుకున్నారు. విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యా ర్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం : ఎవో

**అల్లాదుర్గం, సెప్టెంబరు 23 ప్రభాతార్త :** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందుకునేందుకు అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ సూచించారు. పట్టా పాసుపుస్తకాలు కలిగిన రైతులు వ్యవసాయపరికరాలు సబ్సిడీపై అందుకునేందుకు దరఖా స్తులు చేసుకునేందుకు అర్హులని రాజేష్ పేర్కొన్నారు. బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, కేజీవీల్స్, పవర్ టిల్లర్ లాంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన రైతులు సకాలంలో దరఖాస్తులు చేసుకుని పరికరాలను అందుకోవాలని ఎఓ రాజేష్ మండల రైతులకు సూచించారు.

## 21 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పేదలకు సిఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని ఆత్మ కమిటి చైర్మన్ పి రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాలకు చెందిన 21 మంది అనారోగ్యాలకు గురికాగా మెరుగైన చికిత్సలు అందుకునేందుకు 9లక్షల 78వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంప్ కార్యాలయంలో అందచేశారు. చెక్కులు అందుకున్న బాధితులు సిఎం రేవంత్ రెడ్డికి, మాజీ మంత్రి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, మక్సూద్ ఆహ్మద్, సత్వార్ సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు మల్లన్నపాటిల్, జ్ఞానరత్నం, ఇప్పపల్లి మాజీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు హుగ్గెల్లి రాములు, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ. 10 వేలు విరాళం

**నర్సాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** జగదాంబ ఆలయ నిర్మాణానికి బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ పదివేల విరాళాన్ని ఇచ్చారు. ఈ మేరకు శివ్వంపేట మండల పరిధిలోని రత్నాపూర్ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ జగదాంబ మాత ఆలయాన్ని నిర్మిస్తున్నారు. తండావాసులు నూతనంగా నిర్మిస్తున్న శ్రీ జగదాంబ ఆలయ నిర్మాణానికి బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ పదివేల విరాళం అందజేశారు. ఈ సందర్బంగా ఆయనను ఆ తాండావాసులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ తో పాటు తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు..

**వెల్దుర్తి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని మన్నె వారి జలాల్పూర్ గ్రామ శివారులో వెలసిన కాళికామాత ఆలయంలో మంగళవారం నాడు మహిళలు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా గోపూజ. అమ్మవారికి అభిషేకము. కుంకుమార్చన. ప్రత్యేక అలంకరణతో హోమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి మొక్కులు తెరుచుకున్నారు.


ధర్నా చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న డిఎస్పీ నరేందర్‌గౌడ్

## ప్రభుత్వ భూమిని కాపాడండి

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** దుర్గామాత ఆలయ గ్రామ కంఠం భూమి ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని అంబాజీపేట గ్రామస్థులు మంగళవారం మెదక్ చేగుంట ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ఉన్న దుర్గామాత ఆలయం, గ్రామకంఠం 25 గుంటల భూమిని కొంతమంది రియల్టర్లు కబ్జాచేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. వారంరోజుల క్రితం చిన్నశంకరంపేట తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం పనులు నిర్వ హించడానికి ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ డిఎస్పీ నరేందర్‌గౌడ్, తహసీల్దార్ మాలతి, రామయంపేట సిఐ వెంకట రాజాగౌడ్, ఎస్ఐ నారాయణగౌడ్ అక్కడికి చేరుకొని గ్రామస్థు లతో మాట్లాడారు. ఆలయానికి అనుకొని ఉన్న భూమి యజమానితో మాట్లాడతామని, పూర్తిగా సర్వే నిర్వహిస్తామని, కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దాదాపుగా గంటపాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. అనం తరం దుర్గామాత ఆలయంలో డిఎస్పీ నరేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నర్సాపూర్‌లో పోషణపై అవగాహన

**నర్సాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పోషణ మాస ఉత్సోత్సవాల సందర్బంగా మంగళవారం నర్సాపూర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు పోషకాహారాలు పోషణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజక్టు సిడిపిఓ హిమా భార్గవి ప్రయాణికులకు ఈ పోషణపై అవగాహన కల్పించారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆకుకూరలు వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఇందులో భాగంగా మన ప్రకృతిలో దొరికే 40 రకాల ఆకుకూరలను బస్టాండ్‌లో ప్రదర్శించారు. ఈ సందర్బంగా ఏ ఆకుకూరలో ఎలాంటి పోషక విలువలు ఉంటాయో తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, సరళ కుమారి, లక్ష్మీ నరసమ్మ పాల్గొన్నారు

## కర్షకులకు యూరియా కష్టాలు..

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కర్షకులకు యూరియా కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో పంటలసాగును చేద్దామనుకున్న అన్నదాతకు తీవ్రనిరాశే ఎదుర వుతోంది. పంటకాలానికి సరిపడా యూరియా అందుబాటులో లేకపో వడంతో చేతికి తగినంత యూరియా సంచులు అందకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. మండలంలో ఎక్కడ యూరియా వచ్చిందని తెలిస్తే అన్నదాతలు అక్కడ బారులుతీరుతున్నారు. నెలన్నరరోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గవ్వలపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతుల దుస్థితి యూరియా అవసరాన్ని తెలుపుతోంది. సమయానుకూలంగా యూరియా సరఫరా చేయకపోవడంతో తీవ్రమైన కొరత ఏర్పడి ఒకేసారి రైతులంతా ఎరువుల కోసం పాట్లు పడాల్సి వస్తోంది. రైతుల అవసరాలకు తగ్గట్లుగా యూరియాను సమయానుకూలంగా అందివ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందడంతో అన్నదాతలు తీవ్రంగా మండిపడుతున్నారు.


గవ్వలపల్లిలో యూరియా కోసం బారులుతీరిన రైతులు

# రైతులు మోతాదుకు మించి యూరియా వాడకూడదు

### ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** రైతులు వరి పంటకు మోతాదుకు మించి యూరియా వాడకూడదని రామాయంపేట ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ సూచించారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వానాకాలం సీజన్ మొదటి వారంలో ఎంటియు 1010 రకం వరి విత్తనాలను ప్రతిగ్రామానికి ఇద్దరు రైతులకు అందజేయడం జరిగింది. వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలతో రూపొందించిన నాణ్యమైన విత్తనం రైతుల ద్వారా అభివృద్ధిపరిచి మిగతా రైతులకు ఇవ్వాలనే సదుద్దేశంతో వ్యవసాయ శాఖ మరియు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం నాడు వరి పంటను పరిశీలించడం జరిగింది. నాణ్యమైన విత్తనాలతో పాటు విత్తన దశ నుండి పంట కోత వరకు వివిధ దశల్లో చేపట్టవలసిన సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేస్తూ నాణ్యమైన విత్తనం అభివృద్ధి చెందే విధంగా రామయంపేట డివిజన్ పరిధిలో రామాయంపేట, నిజాంపేట మండల రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీమతి నిర్మల, ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తో కలిసి ఈరోజు రామయంపేట మండలం ఆర్ వెంకటాపూర్ గ్రామంలో రైతు యాదయ్య క్షేత్రాన్ని సందర్శించడం జరిగింది. చిరు పొట్ట దశలో చీడపీడలు సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు, కార్బన్డిజం మ్యాంకో జబ్ కలిగిన తెగులు మందును పిచికారి చేసినట్లయితే తర్వాత దశల్లో కాండం తొలిచే పురుగు మరియు అగ్గి తెగులును కొంతవరకు అరికట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్బంగా ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనం రైతుల చేత అభివృద్ధి పరిచి మిగతా రైతులకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశ నుండి గింజ పాలు పోసుకునే దశలో ఉందని ఈ దశలో మోతాదుకు మించి యూరియా వాడకూడదని, మోతాదు మించి యూరియా వాడడం వల్ల చీడపీడలు ఎక్కువగా సోకి పంట దిగుబడి పై తీవ్ర ప్రభావం ఉండే అవకాశం ఉందని రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయి కృష్ణతో పాటు రైతులు పాల్గొన్నారు,

## పారిశుధ్య కార్మికులకు ఎన్ఆర్ఐ చేయూత

**చేర్యాల, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని ముస్త్యాల గ్రామ పంచాయతి పారిశుధ్య కార్మికులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పెడుతల బాలమణి ప్రతాప్‌రెడ్డి దంపతులు చేయూతనందించారు. మూడు నెలల నుండి వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకుని మంగళవారం మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి చేతుల మీదుగా తొమ్మిది మంది పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున దసరా కానుకగా అందించారు. ఈ సందర్బంగా పారిశుధ్య కార్మికులు ఎన్ఆర్ఐ దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ద్విచక్ర వాహనం వేలం

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో గతంలో పట్టుబడిన ఒక టివిఎస్ ఎక్స్ఎల్ ద్విచక్ర వాహనాన్ని నేడు(బుధవారం) వేలం పాట నిర్వహించడం జరుగుతుందని సిఐ పవన్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా విడుదల చేసిన ప్రకటనలో ఆసక్తిగల వారు ఉదయం 11 గంటల వరకు స్టేషన్‌కు వచ్చి ఈ వేలం పాటలో పాల్గొవాలని సూచించారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేటతోపాటు మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన కొంత మంది గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందగా అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణతో కలిసి పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీ, కలిముద్దిన్, మహేందర్, శంకర్, రాములు, వహీద్ ఖాన్, హర్షత్, బాబు, రజిని, అజ్మర్, సాయి, ప్రతాప్, రాకేష్ తదితరులు ఉన్నారు.

## స్వగ్రామానికి విద్యుత్ దీపాల వితరణ

**దుబ్బాక(అక్బర్‌పేట భూంపల్లి) సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** బతుకమ్మ, దసరా ఉత్సవాలు దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు గ్రామంలో విద్యుత్ దీపాలు అవసరం ఉన్నదని గ్రహించిన సోలిపేట ప్రసాద్ రెడ్డి తమ స్వగ్రామమైన చిట్టాపూర్ గ్రామంలో విద్యుత్ దీపాల ఏర్పాట్లకు సంబంధించి 100 బల్బులు రెండు బెండల వైర్ బెండాలు, హోల్డర్స్‌లను గ్రామ చావిడి (కచేరి) దగ్గర గ్రామపంచాయతీ సిబ్బందికి మంగళవారం అందజేశారు. విద్యుత్ దీపాలు అందించినందుకు గాను గ్రామము తరపున ప్రసాద్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న గజ్వేల్ ఎస్ఐ


మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ రఘుపతిగౌడ్, స్థానికులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** గజ్వేల్‌లోని వినాయక ఫర్నిచర్ దగ్గర దొగుట గ్రామానికి చెందిన చింత లక్ష్మి అనే మహిళ షాపు ముందున్న మెట్లు ఎక్కుతుండగా ఆసరా కోసం పక్కనే ఉన్న సర్వీస్ వైర్లను పట్టుకోగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి కింద పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న గజ్వేల్ ఎస్ఐ వి.రఘుపతిగౌడ్ తన సిబ్బంది సంతోష్, స్వామి మరియు స్థానికులతో కలిసి అంబులెన్స్ రప్పించి మహిళను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మహిళ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

## హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం మాజీ వైస్ ఎంపిపి అత్తెల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్యాల భద్రయ్య, ప్రశాంత్, కాశీనాథ్, వెంకటేశం, హనుమంతు, శ్రీకాంత్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**వర్గల్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో శరన్నవరాత్ర మహోత్సవాల్లోభాగంగా మంగళవారం శ్రీగాయత్రి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. కాగా మొదటగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు అమ్మవారికి విశేష అభిషేకాలు, గణపతి పూజ, సుప్రభాతం, గిరి ప్రదక్షణం, అలంకారం, పంచ హారతులు, చతుష్టోపచార పూజ, రాజోపచార పూజలు, చండీ హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ సకల వేద స్వరూపం శ్రీ గాయత్రి మాత కాగా, అమ్మను ధ్యానిస్తే సకల శుభాలు కలుగుతాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీ గాయత్రిని అనంత శక్తి స్వరూపంగా పూజిస్తుండగా, భక్తిశ్రద్ధలతో అర్చిస్తే సకల వెలుగులు ప్రసాదిస్తుందని వివరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 23 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి సత్యప్రకాష్ మాట్లాడుతూ పిల్లలకు, మహిళలకు, చర్మ వ్యాధిగ్రస్తులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించామని, అదేవిధంగా కంటికి సంబంధించిన పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, పళ్ళ, మానసిక సంబంధిత వైద్య పరీక్షలతో పాటు సాధారణ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు సాయి కిరణ్, జనరల్ మెడిసిన్ వెంకటసాయి, స్త్రీ వైద్య నిపుణులు మన్విత, చర్మ వైద్య నిపుణులు సుష్మిత, కంటి వైద్య నిపుణులు సంధ్యారాణి, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు కల్యాణచక్రవర్తి, పళ్ల వైద్య నిపుణులు శ్రీజ, మానసిక సంబంధిత వైద్య నిపుణులు మనో కుమార్, పిహెచ్‌సి సిబ్బంది జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వలియొద్దీన్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

**పుల్కల్, సెప్టెంబరు 23 ప్రభాతార్త :** ఉమ్మడి పుల్‌కల్ మండలంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మాదిగ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉమ్మడి పుల్‌కల్ మండలంలో మాదిగల జనాభాకు అనుగుణంగా అధికస్థానాలు కేటాయించాలని ఆయా పార్టీలకు సూచించారు. గతంలో జరిగిన ప్రతి ఎన్నికల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని, ఈ మారు ఎన్నికల్లో మాదిగలకు అన్యాయం జరగకుండా స్థానాలు కేటాయించాలని కోరారు. మాదిగలను విస్మరిస్తే ఎన్నికల్లో తమ సత్తా చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, పుల్‌కల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బచ్చమొల్ల ఉదయ్‌కుమార్, ఎర్రోళ్ల పోచయ్య, డప్పు మాణిక్యం, బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపిటిసి సభ్యులు భూమక్కల లింగయ్య, ఇసోపిపేట గ్రామ ఉపాధ్యక్షులు శివనోళ్ల గణపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల మాదిగ నాయకులు

## బంగారు మైసమ్మ నవరాత్రి ఉత్సవాలు

-భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన బంగారు మైసమ్మ

**సదాశివపేట, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
సదాశివపేటలోని అమ్మవారి దేవాలయాలలో నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. పట్టణంలోని దుర్గమ్మ దేవాలయం, మహాకాళి దేవాలయం, చౌడమ్మమందిరం, భవానీమాత ఆలయం, అమ్మవారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుచున్నాయి. మంగళవారం అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

## న్యూజెర్సీలో భగవాన్‌రెడ్డిని కలిసిన ఆదర్శ్‌రెడ్డి




తెలంగాణసంఘం అధ్యక్షులు భగవాన్‌రెడ్డిని కలుసుకున్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
అమెరికా పర్యటనలో భాగంగా మంగళవారం పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి న్యూజెర్సీలో తెలంగాణ సంఘం అధ్యక్షులు భగవాన్‌రెడ్డిని, సంఘంబాధ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని సంప్రదాయాల ప్రాచుర్యం అమెరికాలో నిలబెట్టడంతో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకమన్నారు.

## జహీరాబాద్‌లో ఎల్ఐసి ఏజెంట్ల సంబరాలు




ఎల్ఐసి కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న ఏజెంట్లు

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
పట్టణంలోని జీవితబీమా కార్యాలయంలో మంగళవారం ఎల్ఐసి ఏజెంట్లు ఎల్ఐసి పాలసీదారులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి పాలసీలపై విధిస్తున్న జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయడంతో పాలసీదారులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందని, అందుకు కృతజ్ఞతగా కార్యాలయంలో ఆనందోత్సాహాలతో మిఠాయిలు తినిపించుకుంటూ సంబురాలు చేసుకున్నారు. 8 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల ఫలితమే జిఎస్‌టిని పూర్తిస్థాయిలో రద్దుచేశారని ఏజెంట్లు సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరాజు, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌రావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, ఏజెంట్లుసంఘం అధ్యక్షులు ఇ.విఠల్‌గౌడ్, కార్యదర్శి తేజరెడ్డి, కోశాధికారి ప్రవీణ్, ప్రభు శంకర్, అంజయ్య, రాజ్‌కుమార్ ప్రభు పాటిల్, కిష్టన్న, డెవలప్‌మెంట్ అధికారులు, పాలసీదారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయాగ్రామాల్లో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గామాతను ప్రతిష్ఠించుకుని నిత్యం ఓరూపంలో అమ్మవారిని అలంకరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆచరణగా కొనసాగుతూ వస్తోంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లో భవానీమాత మందిరంలో, హద్నూర్ గ్రామంలో కాళికామాత ఆలయంలో, రత్నాపూర్‌లో భవానీమాత మందిరంలో, రేజింతల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో గ్రామాలు అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని హద్నూర్ గ్రామంలోని కాళికామాత ఆలయంలో అమ్మవారివిగ్రహాన్ని ప్రతిష్ఠించుకునేందుకు పట్టణప్రాంతం నుంచి తీసుకువచ్చిన అమ్మవారివిగ్రహాన్ని భక్తులు భజనలుచేస్తూ ఆలయం వరకు అమ్మవారి ఊరేగింపుగా తీసుకుపోయి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన షెడ్డులో ప్రతిష్ఠించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## గ్రామాల్లో భవానీమాతకు ప్రత్యేకపూజలు

**మనూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మైకోడ్, బాధల్‌గావ్, రాణాపూర్, దవ్వూర్ తదితరగ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిష్ఠించుకున్న భవానీమాత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న మండపాలను రంగురంగు పూలతో అందంగా ముస్తాబుచేసుకుని అమ్మవార్లను ప్రతిష్ఠించుకుని భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## ఐకెపి కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న అధికారులు

**కంది, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలోని ఇందిరా క్రాంతి పథకం (ఐకెపి) కార్యాలయ ఆవరణలో మహిళా అధికారులు మండల సమైఖ్య ఆధ్వర్యంలోబతుకమ్మ వేడుకలను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. రంగురంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట పేర్చి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శివలక్ష్మి, మండల సమైఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

## గీతం పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని ఈఈసిఈ విభాగం పరిశోధక విద్యార్థిని డి.రమాదేవి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసిఈ ప్రొఫెసర్ పి.త్రినాథరావు మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమాదేవి ఆర్థోగోనల్ ఫ్రీక్వెన్సీ డివిజన్ మల్టీప్లెక్సింగ్, యూనివర్సల్ ఫిల్టర్డ్ మల్టీక్యారియర్ సిస్టమ్‌లపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. హైపీక్ టు యావరేజ్ పవర్ రేషియో దీర్ఘకాలిక సవాలును పరిష్కరించడానికి, ఆమె ఒక వినూత్న డీకంపోజ్డ్ సెలెక్టివ్ మ్యాపింగ్ టెక్నిక్‌ను ప్రతిపాదించిందన్నారు. స్పెక్ట్రల్ సామర్థ్యాన్ని కొనసాగిస్తూ, మ్యాట్‌లాబ్ అనుకరణలద్వారా ధృవీకరించిన సిస్టమ్ పనితీరును మెరుగుపరుస్తుందని వివరించారు. డాక్టర్ రమాదేవి సమర్పించిన సిద్ధాంతవ్యాసం పిహెచ్‌డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ తదితరులు సంతోషాన్ని వ్యక్తంచేశారు.

# వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

-త్వరలో 6కోట్ల రూపాయలతో బాక్స్ డ్రైనేజీ పనులు
-జాతీయ రహదారి నుండి విజేత కాలనీ వరకు నూతన సిసి రోడ్డు
-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
-వరద ముంపు కాలనీలలో స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన



వరదనీటి సమస్యలను కాలనీవాసులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ మున్సిపల్‌పరిధిలోని ముత్తంగి, ఇస్నాపూర్ మున్సిపల్‌పరిధిలోని చిట్కుల్ గ్రామంపరిధిలో నూతనంగా ఏర్పడిన కాలనీలలో వరదనీరు మూలంగా ఏర్పడుతున్న సమస్యకు శాశ్వత ముగింపు పలుకుతూ అతిత్వరలో ఆరుకోట్ల రూపాయలతో బాక్స్‌డ్రైనేజ్ నిర్మాణపనులను ప్రారంభించబోతున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముత్తంగి పరిధిలోని విజేతకాలనీ, చిట్కుల్ పరిధిలోని ఓడిఎఫ్‌కాలనీ, రమణయ్య ఎంక్లేవ్, నాగార్జున కాలనీ, రాధమ్మ కాలనీ, బాలాజీనగర్, బృందావన్ కాలనీ, రాయల్ కాలనీలలో ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా పర్యటించారు. వివిధశాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. స్వయంగా ప్రజలను కలిసి వారి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ముత్తంగి, ఇస్నాపూర్ చెరువులనుండి అలుగులుపారుతూ జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తున్న నీటిని కాలనీలలోకి వెళ్లకుండా నూతన బాక్స్‌డ్రైనేజీ ద్వారా చిన్న వాగులోకి పంపించడం జరుగుతుందని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు అవుతున్న నూతన కాలనీలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇస్నాపూర్, ముత్తంగి చిట్కుల్ గ్రామాల పరిధిలో ఇటీవల పదుల సంఖ్యలో నూతన కాలనీలు ఏర్పాటయ్యాయని, వాటిలోనూ మౌలిక వస్తువుల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ముత్తంగిపరిధిలోగల ఎంకచెరువు సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని, 29వ తేదీన జరగనున్న బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువు ప్రాంగణంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను రెండురోజుల్లో తొలగించాలని, గుర్రపుడెక్క తొలగింపు యంత్రాన్ని వెంటనే పంపించాలని. హెచ్‌ఎండిఏ ఉన్నత అధికారులకు సూచించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల మూలంగ గత కొన్ని నెలలుగా ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీలకు మంచినీటి సరఫరా ఆగిపోయిందని, వెంటనే మంచినీటి పైపులైన్ల పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని నేషనల్ హైవేస్ డిఈ రామకృష్ణను ఆదేశించారు. పటాన్‌చెరు నుండి రుద్రారం వరకు జాతీయ రహదారిపై వరదనీరు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. ముత్తంగి గ్రామ పరిధిలోని విజేత కాలనీలో అతిత్వరలో ఇసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. ప్రజలసమస్యల పరిష్కారమే తమ ఎజెండా అని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటకిషన్‌రావు, అజయ్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ డిఈ సురేష్, ఇరిగేషన్ డిఈ రామస్వామి, జాతీయ రహదారుల డిఈ రామకృష్ణ, విద్యుత్ శాఖ డిఈ తులసిరావు, మాజీ ఎంపిపి శ్రీశైలంయాదవ్, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపిపిలు స్వప్నశ్రీనివాస్, ప్రభాకర్, ముత్తంగి పిఎసిఎస్ అధ్యక్షులు బిక్షపతి, కిట్టు, విష్ణువర్ధన్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మేరాజ్ ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**మునిపల్లి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును మంగళవారం హైద్రాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీమంత్రిని కలిసినవారిలో మండల మాజీ ఎంపిపి గౌడిగామ శైలజ శివశంకర్, మండల బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మంతూర్ శశికుమార్, మండలయువత అధ్యక్షులు ఆనంద్‌రావు, చిన్నచిల్మెడ మాజీ ఉపసర్పంచ్ దత్తుగౌడ్, మండల నాయకులు విఠల్, పెదలోడి మాజీ ఎంపిటిసి సభ్యులు వెంకటేశం, గార్లపల్లి శంకరయ్య, చీలపల్లి నాగేష్, బోడిశెట్టిపల్లి పాండు, పిల్లోడి ధనరాజ్‌గౌడ్, ప్రభుగౌడ్, తాటిపల్లి సుధాకర్‌రెడ్డి, రవి, సంచుల ప్రసాద్, పెద్దలోడి గ్రామశాఖ అధ్యక్షులు మొగులయ్య, గార్లపల్లి గ్రామశాఖ అధ్యక్షులు ఈశ్వరప్ప తదితరులు ఉన్నారు.

## రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం

-భూమిపూజ చేసిన కార్పొరేటర్ పుష్పనగేష్



రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి శ్రీకారంచుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామంద్రాపురం రాయసముద్రం చెరువు వద్ద నిర్మించిన నాగులమ్మతల్లి దేవాలయంవద్ద మట్టి కుంగిపోతుండటంతో పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు స్థానికుల వినతి మేరకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ రూ.16లక్షలను మంజూరు చేయించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఎఈ దివ్య, నాయకులు చిగురు శ్రీను, కిరణ్‌గౌడ్, అప్పల భాస్కర్, నవీన్‌గౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్ కావలి నగేష్, మాజీ ఎఎంసి డైరెక్టర్ ఐలాపూర్ ఐలేష్, గారెల్ల శ్రీశైలం, సిఎం మల్లేష్, రవిగౌడ్, సంతోష్, బైకన్ నవీన్‌యాదవ్, కుమ్మరి రాజు, బికె శ్రీనివాస్, ఎర్ర హన్మంతు, నాగరాజుగౌడ్, కిట్లు కుమ్మరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్వాలాముఖి వార్షికోత్సవం

-హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పట్లోల్ల సంజీవరెడ్డి

**కంగ్టి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
కంగ్టి మండలం ఎడ్లరేగడి తండాలో జ్వాలాముఖి అమ్మవారి వార్షిక మహాజాతర మంగళవారం జోరుగా సాగింది. ఈ జాతరకు స్థానిక నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్థానిక ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన హోమంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి మంగళ్‌చంద్‌మహారాజ్ వారిని శాలువాతో సన్మానం చేశారు. తదనంతరం వారు ఆడే ఖేల్‌కుద్ ఆటలో పాల్గొన్నారు. మథుర లబానా, గిరిజనులు ఘనంగా ఈ జాతరలో పాల్గొన్నారు. స్థానికులే కాకుండా పక్కనే ఉన్న కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల నుంచి పెద్దయెత్తున మథురలబానాతరలివచ్చారు. తమ అరాధ్యదైవం జ్వాలాముఖి, కాళుబాబా, రాంసింగ్‌బాబా, మాన్సింగ్‌మహారాజ్ ఆలయాలను దర్శించుకున్నారు. మూడురోజులపాటు జాతరను జరుపుకుంటారు. ప్రతిరోజు అన్నప్రసాదం వితరణచేస్తారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సిండే, మాజీ జడ్పిటిసి నగేష్‌సెట్కార్, డిసిపి ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామపెద్దలు, ఆయాగ్రామాల నాయక్, కారోభారీలు జ్వాలాముఖి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, ఎంపి చిత్రపటాలకు క్షీరాభిషేకం

-ఆనందంలో బంజారా నాయకులు



ఎంపి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకంచేస్తున్న బంజారానాయకులు

**సిర్గాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్, భవానీమాత ఆలయాల నిర్మాణం కోసం 2కోట్ల రూపాయల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌లకు బంజారా నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు మంగళవారం పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రాజు, పరశురాం, విఠల్‌నాయక్, గోవర్ధన్‌నాయక్, బొజ్జ నాయక్, సర్దార్ పండరి, శంకర్, లక్ష్మణ్, రవి, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీట్లు సాధించిన మైనార్టీ గురుకుల విద్యార్థులు

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ కళాశాలలో విద్యను అందుకుని ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలు రాసిన ముగ్గురు విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లను సాధించినట్లు ప్రిన్సిపాల్ జెరాములు, ఎఎస్ జమీల్‌లు తెలిపారు. ఎంబిబిఎస్ సీట్లు సాధించిన ఎండి ఉబేద్ నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, గౌతమ్‌కన్న నిర్మల్ ప్రభుత్వ మెడికల్‌కళాశాలలో, డి.సృజన్‌కుమార్ ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలో, వైద్యవిద్యను అందుకునేందుకు అర్హత సాధించారన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

# రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డిఆర్ఎం




జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న డిఆర్ఎం గోపాలక్రిష్ణ దృశ్యం

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణ మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. సికింద్రాబాద్ నుంచి కర్ణాటకలోని బీదర్ వరకు రైల్వే పనులను పరిశీలించేందుకు గోపాలక్రిష్ణ ప్రత్యేక రైల్వేబోగీలో వచ్చారు. అమృత్‌బాల్ పథకంలో భాగంగా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలక్రిష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమృత్‌బాల్ స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామన్నారు. ఆధునీకరణ పనులను త్వరిగగతిన పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో వారానికి ఒకరోజు నడిచే పూర్ణ తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును జహీరాబాద్ స్టేషన్‌లో ఆగేలా చొరవ తీసుకోవాలని, ఇంటర్‌సిటీ సర్వీసులు మరిన్ని పెంచాలని, కల్బుర్గా బీదర్ డెమో రైలును జహీరాబాద్ రైల్వేస్టేషన్ వరకు నడిపించాలని బిజెపి శ్రీనివాస్‌గుప్తా, మాజీ కౌన్సిలర్ రాములు నేతలు డిఆర్ఎం గోపాలక్రిష్ణ దృష్టికి తీసుకుపోయారు. రైల్వేస్టేషన్‌కు వచ్చిన డిఆర్ఎం గోపాలక్రిష్ణను జహీరాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ పూలబోకేను అందించి శాలువాతో సత్కరించారు.

## హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి

**నిజాంపేట్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలం మేగ్యనాయక్‌తండా వద్ద వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుకు ఇరువైపులా మట్టితవ్వేసి, కంకర దిబ్బలను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులుకూడా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యపై రోడ్డుకాంట్రాక్టర్ వెంటనే స్పందించి, ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

-ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఇరక్‌పల్లి మేఘనాయక్‌తండాలో దేవిదాస్ మహారాజ్ నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించేందుకు తీసుకువచ్చిన అమ్మవారి విగ్రహానికి భక్తులు ర్యాలీగా భజనలు చేస్తూ, బోనాలతో కొత్తగా నిర్మించిన ఆలయానికి తరలించారు. ఆలయంలో ప్రతిష్ఠాదేవతాహోమం పూజలు నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండాపూర్ పీఠాధిపతి సంగ్రామంమహారాజ్, మాజీ జడ్పిటిసి సభ్యులు రవిందర్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు సద్దాం, శివరాం, సంజీవ్‌కుమార్, నాగిరెడ్డి, వెంకట్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువుకట్టపై ఈనెల 29వ తేదీ సోమవారం సాయంత్రం నిర్వహించబోయే సద్దులబతుకమ్మ సందర్భంగా మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి సాకి చెరువుకట్టపై బతుకమ్మపండగ ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈసారి తెలంగాణసంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిచేలా కార్యక్రమాలతోపాటు, ప్రముఖ జానపద సినీగేయ కళాకారులచే సాంస్కృతికవిభావరి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. బతుకమ్మ ఘాటువద్ద మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిహెచ్ఎంసి సిబ్బందితోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత్‌దీపాలు, తాగునీరు, అత్యవసర వైద్యసిబ్బందితోపాటు పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ పండుగను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఎఈ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ వంటగది సందర్శన

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
మార్పు ఏ ఒక్క రంగానికో పరిమితం కావడంలేదు. వంటగదీ అందుకు మినహాయింపు కాదు. అత్యాధునిక వంటగది (ప్రీమియమ్ కిచెన్)కి ఎలా రూపకల్పన చేయాలి, అందుకు సంబంధించిన ఆవిష్కరణలలో తాజా పురోగతులను అన్వేషించడానికి గీతం, హైదరాబాదులోని ఇంటీరియర్ డిజైన్ (ఏడో సెమిస్టర్) విద్యార్థులు బిఎస్‌హెచ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ మంగళవారం సందర్శించారు. నిపుణులైన కన్సల్టెంట్ల మార్గదర్శకత్వంలో, విద్యార్థులు స్పేషియల్ లేఅవుట్ ఆప్టిమైజేషన్, మెటీరియల్ హార్మోనీ, వినియోగదారులసౌకర్యాన్ని పెంచడంలో సాంకేతికత పాత్రతో సహా సమకాలీనవంటగది ప్రణాళికగురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన ఇంటీరియర్ డిజైన్ అభివృద్ధిచెందుతున్న రంగంలో శైలి, ఆవిష్కరణ, రోజువారీ వినియోగాన్ని సమతుల్యంచేసే స్థలాలుగా వంటశాలలను తిరిగి ఊహించుకోవడానికి విద్యార్థులను ప్రేరేపించింది.

## స్వయంభూ తుల్జాభవానీమాత దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

-లక్ష రూపాయల విరాళం ఇచ్చిన జిఎంఆర్

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్‌గ్రామంలోగల స్వయంభూ తుల్జాభవానీమాత దేవాలయాన్ని మంగళవారం పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. నవరాత్రులను పురస్కరించుకొని ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమానికి లక్షరూపాయల సొంత నిధులను విరాళంగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వయంభువుగా వెలసిన అమ్మవారి దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అమ్మవారికృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ ఎంపిపి శ్రీశైలంయాదవ్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, రమేష్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## వరిపంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

**కంగ్టి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
కంగ్టిమండలంలో తడ్కల్‌గ్రామంలో మంగళవారం నారాయణఖేడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.నూతన్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి హరీష్‌పవార్ వ్యవసాయ విస్తరణ అధికారి హనుమండ్లు, భార్గవ్, నాగేందర్ ఆధర్వంలో వరిపొలాలను సందర్శించి కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని ముఖ్యంగా 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదు అని రైతులకు తెలియచేయడం జరిగింది. యూరియా 4 దఫాలుగా వాడాలని, వేసినప్పుడు 25 కేజీలు మాత్రమే వేయాలని, ఎక్కువవాడితే రోగాలు, తెగుళ్ల వస్తాయని తెలపడం జరిగింది. కావున రైతులు యూరియా బదులుగా నానో యూరియాని వాడాలని ఒక ఎకరానికి 500 మిల్లీలీటర్ మాత్రమే వాడాలి. వరిలో అగ్గితెగులు నివారణకు కాసుగామైసిన్ మందునుగాని ట్రైసైక్లోజోల్ మందునుగాని ట్రైసైక్లోజోల్, మ్యాన్కోజబ్‌ల మిశ్రమాన్నిగాని ఉదయం లేదా సాయంత్రం వేళలో పిచికారీ చేసుకోవాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు అగ్రిమైసిన్ లేదా ప్లాంటోమైసిన్ పిచికారీ చేసుకోవాలి. కాబట్టి వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తూచా తప్పకుండా పాటిస్తూ తగిన మోతాదులో, అవసరం ఉన్నప్పుడు మాత్రమే వేయాలని రైతులకు సూచనలు చేయడం జరిగినది.

## నిరుపేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

-ఎమ్మెల్యే జిఎంఆర్
-రూ.57లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పటాన్‌చెరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**
పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గపరిధిలోని వివిధగ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు సంబంధించిన 125మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 57లక్షల 74వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసరపరిస్థితుల్లో మెరుగైన వైద్యసహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.